RNI: TELTEL12215

https://youtube.com/@PrabhathasuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

RANGAREDDY, EDITION : 01, VOLUME :197 EDITOR: CHERUKU UPENDAR, DATE : SATURDAY 02 DECEMBER 2023 PAGES:4 RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 197 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 02 డిసెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-

## జిల్లాలో పోలీసు యాక్ట్

### - ఎస్పి పి.రోహిణి ప్రియదర్శిని



మెదక్- ప్రభాత సూర్యుడు : జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా డిసెంబర్ 31వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పి రోహిణి ప్రియదర్శిని తెలిపారు. పోలీసు అధి కారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి

మిగతా 2లో

## వర్ధమాన దేశాలకు నిధులు అందాలి

### - సంపన్న దేశాలకు మోడీ పిలుపు




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

వర్ధమాన దేశాలకు సాంకేతిక బదిలీ జరగాలని, వాతావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులను అందించేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీ సంపన్న దేశాలకు పిలుపిచ్చారు. వాతావరణ సమస్యలను సృష్టించడంలో వర్ధమాన దేశాల పాత్ర వుండడం లేదని, అయినా కూడా వారు సమస్య పరిష్కారంలో భాగస్వాములవడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాల్సి వుందన్నారు. సమానత్వం, వాతావరణ న్యాయం, పరస్పరం పంచుకునే బాధ్యతలు, సామర్థ్యాల ప్రాతిపదికన వాతావరణ కార్యాచరణ వుండాలని తాను విశ్వసిస్తానని చెప్పారు.
ఈ సూత్రాలకు కట్టుబడి వుండడం ద్వారా

మిగతా 2లో

## కేంద్రం గుప్పిట్లోకి సాగర్

- కెఆర్ఎంబికి నిర్వహణారక్షణ బాధ్యత సిఆర్‌పిఎఫ్‌కు
- నవంబర్ 28కి ముందున్న స్థితి ప్రకారం నీటి విడుదల
- రెండు రాష్ట్రాల అంగీకారం - శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా అదే స్థితి?



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలుగు ప్రజల ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నాగార్జున సాగర్ కేంద్రం గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఇప్పటిదాకా వివాదాలను పరస్పరం చర్చించి, పరిష్కరించుకునే అవకాశం ఉండగా ఇక నుండి కేంద్రం కన్నుసన్నల్లోనే వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్యామ్ రక్షణతో పాటు, నీటి విడుదలను కూడా కేంద్రం తన పరిధిలోకి తీసుకుంది. దీంతో ప్రతి చిన్న అవసరానికి కేంద్రం మీద ఆధారపడాల్సిన పరిస్థితి తెలుగురాష్ట్రాలకు ఏర్పడింది. ఈ మేరకు కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ శుక్రవారం చేసిన ప్రతిపాదనలను రెండు రాష్ట ప్రభుత్వాలు

మిగతా 2లో

## 10, 12 తరగతి పరీక్షల్లో డివిజన్, డిస్టింక్షన్ ఇవ్వం

### సిబిఎస్ఇ




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

10, 12 తరగతి పరీక్షల్లో డివిజన్, డిస్టింక్షన్ ఇవ్వమని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) శుక్రవారం ప్రకటించింది. అలాగే మార్కుల శాతాన్ని కూడా పేర్కొనమని స్పష్టం చేసింది. ప్రతీ సబ్జెక్టులో మార్కులను ఇచ్చే విధానాన్నే కొనసాగిస్తామని అవసరమైతే ఉన్నతా విద్యాసంస్థ, సంంధిత యజమాని వాటిని లెక్కించుకోవచ్చునని సిబిఎస్ఇ తెలిపింది. 'డివిజన్, డిస్టింక్షన్, మార్కుల మొత్తాన్ని ప్రకటించం. అలాగే, ఒక అభ్యర్థి ఐదు కంటే ఎక్కువ సబ్జెక్టులను ఎంచుకుంటే.. ఇందులో ఉత్తమైన ఐదు సబ్జెక్టులను అడ్మిషన్ పొందిన సంస్థ లేదా యాజమాని తీసుకోవచ్చు' అని సిబిఎస్ఇ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యాం

మిగతా 2లో

## సచివాలయంలో విజయవంతంగా ప్లాస్టిక్ నిషేధం

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని సచివాలయం ప్రాంగణంలో నిషేధించడంలో విజయం సాధించామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చెప్పారు. సహకరించిన అధికారులను, సిబ్బందిని అభినం దించారు. మూడో తేదీ నాటికి పూర్తిస్థాయిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత ప్రదేశంగా

మిగతా 2లో



## ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం

### - ఎనిమిది మంది మృతి

ఒడిశా- ప్రభాత సూర్యుడు

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న ట్రక్కును వేగంగా దూసుకొచ్చిన వ్యాన్ ఢీకొన ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా, 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. కెందుజార్‌లో శుక్రవారం ఉదయం 5 గంటలకు 20వ నంబర్ జాతీయ రహదారి బలిజోడి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గంజాం జిల్లాకు చెందిన రెండు కుటుంబ సభ్యులు వ్యాన్ లో తారిణి దేవి ఆలయ దర్శనానికి బయలుదేరారు. ఈ

మిగతా 2లో



## గాజాపై దాడులను తిరిగి ప్రారంభించిన ఇజ్రాయిల్



ఇజ్రాయిల్ - ప్రభాత సూర్యుడు

కాల్పుల విరమణ అనంతరం హమాస్ పై దాడులను ఇజ్రాయిల్ మళ్లీ మొదలుపెట్టింది. ఇందుకు కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమస్ ఉల్లంఘించిందనే నెపాన్ని హమస్ పైన ఇజ్రాయిల్ మోపుతోంది. కాల్పుల విరమణ కాల పరిమితి తరువాత తాను తిరిగి దాడులను పునఃప్రారంభిస్తానని ఇజ్రాయిల్ పదేపదే ప్రకటిస్తోంది. హమస్ కాల్పుల విరమణను ఉల్లంఘించి తమ భూభాగంపైన కాల్పులకు తెగబడిందని ఆరోపించటమే కాకుండా గాజాలోని హమస్ స్థావరాలపైన దాడులను మొదలెట్టిందని కూడా ఇజ్రాయిల్ ఆ ప్రకటనలో పేర్కొంది. అంతేకాకుండా గాజాలోని హమాస్ లక్ష్యాలపైన వైమానిక దాడులను మొదలెట్టినట్టు కూడా ఇజ్రాయిలీ సైన్యం ప్రకటించింది. ఇజ్రాయిలీ సైన్యమే కాకుండా ప్రధాన మంత్రి నేతాన్యాహు కూడా హమస్ కాల్పులు విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, బంధీలుగా

మిగతా 2లో

## 3న కౌంటింగ్ ఏర్పాట్లు ముమ్మరం

- తొలుత పోస్టల్ బ్యాలెట్లు
- ఆ తర్వాతే ఈవీఎంలు
- ఉదయం 10 గంటలకల్లా తొలి ఫలితం
- మొత్తం పోలింగ్ 71.34 శాతం
- ఎన్నికల సంఘం సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 2018తో పోలిస్తే 3 శాతం పోలింగ్ తక్కువగా జరిగిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా రీ పోలింగ్ అవకాశాలు లేవన్నారు. తుది గణాంకాల ప్రకారం రాష్ట్రం మొత్తం మీద 71.34 శాతం పోలింగ్ నమోదైందని చెప్పారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఏర్పాట్లు చురుగ్గా జరుగు తున్నాయనీ, దానికి సంబంధించి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మొత్తం 49 ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో 79 నియోజకవర్గాల్లో 75 శాతానికి పైగా పోలింగ్ జరిగిందనీ, అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 90.03 శాతం, అత్యల్పంగా హైదరాబాద్‌లో 46.56 శాతం పోలింగ్ నమోదయ్యిందని తెలిపారు. అలాగే మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 91.89 శాతం పోలింగ్ జరిగింది. అత్యల్పంగా యాఖుత్‌పురా నియోజకవర్గంలో 39.64 శాతం పోలింగ్ నమోదైంది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు పోటీచేస్తున్న గజ్వేలు, కామారెడ్డి రెండు నియోజకవవర్గాల్లో వరుసగా 84.14 శాతం, 75.58 శాతం పోలింగ్ నమోదైంది. పలుచోట్ల మధ్యాహ్నం తర్వాత పోలింగ్ ప్రక్రియ ఊపందుకున్నదనీ, కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి 9.30 గంటల వరకు ఓటింగ్ జరిగిందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా ప్రవేశపెట్టిన హౌం ఓటింగ్ విజయవంతమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16,005 మంది వృద్ధులు, 9,459 మంది వికలాంగులు ఇంటి నుంచి ఓట్లు వేశారని చెప్పారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములైన 1.80 లక్షల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారనీ, థర్డ్ జెండర్ ఓటర్లు అధిక సంఖ్యలో ఓట్లు వేశారని చెప్పారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు 27,094 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 7,591 కేంద్రాల వెలుపల సీసీ టీవీలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేశామన్నారు. దీనివల్ల ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగిందని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 2018లో 2,400 కేసులు నమోదయ్యాయనీ, కానీ 2023 ఎన్నికల్లో 13వేల కేసులు బుక్ చేసి, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. ఎన్నికల నిర్వహణలో పూర్తిపారదర్శకంగా వ్యవహ రించామనీ, పలువురు మంత్రులపై కూడా కేసులు నమోదు చేశామని వివరించారు.



**కౌంటింగ్ ఇలా....**

స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు

మిగతా 2లో

## వర్ధమాన దేశాలకు
# నిధులు అందాలి

(మొదటిపేజీ తరువాయి)
సుస్థిరమైన భవిష్యత్ దిశగా ఒక బాటను ఏర్పాటు చేయగలమని, ఆ క్రమంలో ఎవరూ వెనుకబడి పోరని అన్నారు. ఈ క్రమంలో పేద, వర్ధమాన దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలపై దుబాయ్ లో జరుగుతున్న కాప్ 28 సదస్సుకు హాజరైన మోడీ అక్కడి పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వాతావరణ మార్పులనేది సమిష్టిగా ఎదుర్కొనాల్సిన సవాలని తానెప్పుడూ చెబుతానని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్య ప్రతిస్పందన ఒక్కటే దీనికి పరిష్కారమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులపై చేపట్టే కార్యాచరణ గురించి పెరుగుతున్న ఆశలను వాతావరణ నిధులపై పురోగతిలో చూడాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. సమర్ధవంతమైన, సమిష్టి వాతావరణ కార్యాచరణకు ఈ సదస్సు తాజా ఊపునివ్వగలదని భారత్ ఆశాభావంతో వుందని అన్నారు. అలాగే యుఎన్ఎఫ్సిసిసి, పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో అంతర్జాతీయ సహకారం కూడా పెరగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మరింత పచ్చదనంతో కూడిన, అలాగే సంక్షేమం సమృద్ధిగా వుండగల భవితవ్యం కోసం భారత్, యుఎఇలు భాగస్వాములుగా కృషి చేస్తాయన్నారు. వాతావరణ కార్యాచరణపై అంతర్జాతీయ కార్యకలాపాలను ప్రభావితం చేసేందుకు సంయుక్తంగా కృషి చేయడానికి కట్టుబడి వున్నామన్నారు.

భారత్–యుఇఎ సంబంధాలపై మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ఇప్పటికే మంచి పటిష్టమైన సంబంధాలు వున్నాయన్నారు. ఇంధన భద్రతను మరింత పెంచుకునేందుకు ఉమ్మడి గ్రిడ్‌ను ఏర్పాటు చేయడంలో చేతులు కలపనున్నట్లు చెప్పారు. గ్లోబల్ సోలార్ ఫెసిలిటీకి మద్దతునిస్తామని చెప్పారు.

తదుపరి కాప్ సదస్సుకు భారత్ ఆతిథ్యం ?

2028లో జరగబోయే కాప్ 33 వాతావరణ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని ప్రధాని మోడీ శుక్రవారం ప్రతిపాదించారు. ప్రజల ప్రాతినిధ్యం ద్వారా కార్బన్ సింక్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టే గ్రీన్ క్రెడిట్ ఇనిషియేటివ్‌ను ప్రారంభించారు. అభివృద్ధికి, పర్యావరణ సంరక్షణకు మధ్య సంతులనాన్ని పాటిస్తూ భారత్, ప్రపంచ దేశాలకు గొప్ప ఉదాహరణగా నిలిచిందని చెప్పారు.

2030 జూన్ కల్లా కాలుష్యాల తీవ్రతను 45శాతం తగ్గించాలని, శిలాజయేతర ఇంధనాల వాటాను 50శాతానికి పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన, పేద దేశాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపన్న దేశాలు బదిలీ చేయాలని ఆయన కోరారు .

## సచివాలయంలో
# విజయవంతంగా ప్లాస్టిక్ నిషేధం


(మొదటిపేజీ తరువాయి)
సచివాలయం మారబోతున్నదన్నారు. శుక్రవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ అన్ని హెచ్‌ఓడీలలో స్టీల్, పింగాణీ, క్లాత్, జూట్ వస్తువుల వాడకాన్ని అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. పలు సూచనలు చేశారు. గతంలో సచివాలయ ప్రాంగణంలో ప్రతి రోజు మూడు వేలకు పైగా సింగిల్ యూజ్ వాటర్ బాటిల్స్ వినియోగించే వారనీ, దాన్ని రెండు వందలలోపు వరకు తగ్గించగలిగామని సీఎస్ పేర్కొన్నారు. సచివాలయం ఆవరణలో స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 32 ఆక్వాగార్డు వాటర్ డిస్పెన్సర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. సచివాలయంలోని రోజువారీ వ్యర్థపదార్థాలను రీసైక్లింగ్ చేసి వినియోగదారులకు ఉపయోగపడే ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. సచివాలయ ప్రాంగణాన్ని జీరో వేస్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషిచేయాలనీ, గ్రీన్ కియాస్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## గాజాపై దాడులను తిరిగి ప్రారంభించిన
# ఇజ్రాయిల్

(మొదటిపేజీ తరువాయి)
వున్న మహిళలందరినీ విడుదల చేయలేదని ఆరోపించారు. అంతేకాకుండా ఇజ్రాయిల్ తన యుద్ధ లక్ష్యాలైన బంధీలను విడుదల చేయటం, హమాస్‌ను తిరిగి తలెత్తుకోలేకుండా తుదముట్టించటంవంటి పనులను నెరవేరుస్తుందని ప్రకటించారు. ఉత్తర గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద షరతుల ఉల్లంఘన జరిగిందని ఇరు పక్షాలు పరస్పరం ఆరోపించుకున్నాయి. ఖతార్ మధ్యవర్తిత్వంతో నవంబర్ 24 నుంచి నాలుగు రోజులపాటు కాల్పుల విరమణ చేయటానికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఈ ఒప్పందంలో ప్రధాన మేమంటే అక్టోబర్ 7న ఇజ్రాయిల్ పైన హమాస్ మెరుపుదాడి చేసి బంధీలుగా పట్టుకున్న దాదాపు 240 మందిలో 50 మందిని, 150 పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలి. అంతేకాకుండా హమస్ విడుదల చేసే ప్రతి 10మంది బందీలకు ఒక రోజు కాల్పుల విరమణ చేయటానికి సిద్దమని ఇజ్రాయిల్ ప్రకటించింది. హమాస్ అనేకమంది విదేశీయులతోసహా 100మందికి మించి బంధీలను విడుదల చేయగా, అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ దాదాపు 240 పాలస్తీనా ఖైదీలను విడుదల చేయటంతో కాల్పుల విరమణ అనేకసార్లు పొడిగించబడింది. గురువారంనాడు చివరగా 8మంది ఇజ్రాయిలీ బందీలను గాజాలో రెడ్ క్రాస్ కు అప్పగించగా, ఇజ్రాయిల్ 30మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేసింది.

# కేంద్రం గుప్పిట్లోకి 'సాగర్'

(మొదటిపేజీ తరువాయి)
అంగీకరించాయి. నవంబర్ 28వ తేదికి ముందున్న ఏర్పాట్ల ప్రకారమే సాగర్ నీటిని విడుదల చేయాలని కేంద్రం తాజాగా చేసిన నిర్ణయానికి కూడా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకున్నాయి. మరో భారీ ప్రాజెక్టు శ్రీశైలంలో కూడా ఇదే రకమైన ఏర్పాట్లు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. సాగర్ డ్యామ్‌పైకి రాష్ట్ర పోలీసులు దూసుకెళ్లడం, 13వ గేటు వరకు స్వాధీనం చేసుకుని, కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ హెూమ్‌శాఖ శుక్రవారం రంగంలోకి దిగింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలతో కేంద్ర హెూంశాఖ ముఖ్య కార్యదర్శి అజరుకుమార్ భల్లా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు విడతలుగా సాగిన ఈ సమావేశాల్లో కూడా రెండు రాష్ట్రాలు పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. కేంద్రం చేసిన కొన్ని ప్రతిపాదనలకు చివరకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. వీటి ప్రకారం నీటి విడుదలకు సంబంధించి నవంబర్ 28వ తేదికి ముందున్న పరిస్థితులను పునర్ధరించాల్సి ఉంటుంది. దీనికి తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకారం తెలిపింది. డ్యామ్ నిర్వహణను పూర్తిస్థాయిలో కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అప్పగించాలని డ్యామ్‌కు ఇకనుండి సిఆర్‌పిఎఫ్ దళాలు రక్షణ కల్పిస్తాయంటూ చేసిన ప్రతిపాదనలకు కూడా ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. కెఆర్‌ఎంబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో పనిచేస్తుందన్న సంగతి



తెలిసిందే. దీంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలే కెఆర్‌ఎంబి నిర్ణయాలుగా మారనున్నాయి. అదే జరిగితే, స్థానిక ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలకు కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ప్రశ్నార్ధకమే. డ్యామ్‌పైకి వెళ్లడానికి ఏ రాష్ట్రానికి చెందిన అధికారులకైనా సిఆర్‌పిఎఫ్ అనుమతి తప్పనిసరిగా మారనుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి 900 మంది పోలీసులు, తెలంగాణానుండి 700 మంది పోలీసులు రెండు వైపుల మొహరించడంతో శుక్రవారం కూడా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డ్యామ్‌పైకి చొచ్చుకెళ్లిన ఆంధ్రప్రదేశ్ పోలీసులపై తెలంగాణ ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. తెలంగాణ భూభాగంలోకి అక్రమంగా చొచ్చుకొచ్చారని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారని విజయపురి సౌత్ పోలీసులు చేసిన ఫిర్యాదుల మేరకు ఈ కేసులు నమోదుచేశారు. నీటి విడుదలను ఆపండ్ని రాష్ట్రానికి కెఆర్‌ఎంబి లేఖ నాగార్జున సాగర్ నుండి తక్షణం నీటి విడుదలను ఆపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కెఆర్‌ఎంబి లేఖ రాసింది. నాగార్జునసాగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 15 టిఎంసీల నీటిలో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో పెట్టిన 5 టిఎంసిల ఇండెంట్ మేరకు ఇప్పటికే 5.01 టిఎంసీలను ఆంధ్రప్రదేశ్ వాడుకుందని పేర్కొంది. జూన్‌దాకా వేసవి తాగునీటి అవసరాల మేరకు మిగిలిన 10 టిఎంసీల నీటిని జనవరిలో 5 టిఎంసీలు, మార్చి, లేదా ఏప్రిల్‌లో మరో ఐదు టిఎంసీల నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని తెలిపింది. సాగర్, శ్రీశైలంపై నేడు సమీక్ష నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ శనివారం సమీక్షించనుంది. సాగర్‌తో పాటు శ్రీశైలం డ్యామ్‌ల వద్ద ఉన్న పరిస్థితులను కూడా ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలిసింది. కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జలవనరులశాఖ ఉన్నతాధికారులతో కృష్ణానదీజలాల సమస్యను సమీక్షించనున్నారు.

## ఒడిశాలో
# ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)
క్రమంలో రోడ్డు పక్కన ఆగివున్న ట్రక్కును వ్యాన్ వేగంగా ఢీ కొట్టడంతో అక్కడిక్కడే 8మంది మృతి చెందారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. గాయపడిన 12 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని కటక్ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని కెందుజార్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో చేర్చారు. మంచు కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. వ్యాన్ డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.


## 10, 12 తరగతి పరీక్షల్లో
# డివిజన్, డిస్టింక్షన్ ఇవ్వం

(మొదటిపేజీ తరువాయి)
భరద్వాజ్ తెలిపారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం లేదా తెలియజేయడాన్ని సిబిఎస్ఇ చేయదని భరద్వాజ్ తెలిపారు. తదుపరి ఉన్నత విద్యకు లేదా ఉద్యోగంలో మార్కుల శాతం అవసరమైతే వాటిని ప్రవేశం పొందిన సంస్థ, యజమాని లెక్కించుకోవచ్చునని తెలిపారు. కాగా, గతంలోనే అనారోగ్య పోటీని నివారించడానికి సిబిఎస్ఇ మెరిట్ లిస్టులను ఇచ్చే పద్ధతిని నిలిపివేసింది. సిబిఎస్ఇ 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. భారత్‌తో పాటు 26 విదేశాల్లో 28 వేలకు పైగా సిబిఎస్ఇ అనుబంధ పాఠశాలలు ఉన్నాయి.

# జిల్లాలో పోలీసు యాక్ట్

(మొదటిపేజీ తరువాయి)
ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అలాగే శాంతిభద్ర తలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

## మద్దెల నరసింహకు 18 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత
### పిఎసిఎస్ డైరెక్టర్ మద్దెల శశికళ



యాచారం - ప్రభాత సూర్యుడు

యాచారం మండల పరిధిలోని తాటిపర్తి గ్రామానికి చెందిన మద్దెల నరసింహ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మద్దెల నరసింహ కు 18, 000వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పొలమోని మల్లేష్, సీనియర్ నాయకులు పరికిషన్ రెడ్డి, పాండు, దార అంజయ్య, తదితరులు పాల్గొన్నారు

# 3న కౌంటింగ్ ఏర్పాట్లు ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)
కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 40 కంపెనీల కేంద్ర బలగాలు భద్రతా విధుల్లో ఉంటాయన్నారు. స్ట్రాంగ్ రూముల దగ్గర సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశామనీ, ఇక్కడి నుంచి నియోజకవర్గాల వారీగా ఎన్నికల ఏజెంట్ల సమక్షంలోనే కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎమ్‌లు తరలిస్తామన్నారు. కౌంటింగ్ సెంటర్లలో 1,766 లెక్కింపు టేబుళ్లు, 131 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయని చెప్పారు. ఆరు నియోజకవర్గాల్లో 500కు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయనీ, అక్కడ 28 టేబుళ్లు ఉంటాయని తెలిపారు. 3వ తేదీ ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభమవుతుందనీ, హెూం ఓటింగ్ బ్యాలెట్లను కూడా పోస్టల్ బ్యాలెట్లతో కలిపే లెక్కిస్తారని వివరించారు. ఆ తర్వాత ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుందనీ, ఒక్కో ఈవీఎమ్‌లో ఓట్లను రెండుసార్లు లెక్కిస్తారని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువగా ఉంటే రెండింటి కౌంటింగ్ సమాంతరంగా జరుగుతుందని స్పష్టత ఇచ్చారు. కౌంటింగ్ జరిగే ఒక్కో టేబుల్‌పై ఎన్నికల సూక్ష్మ పరిశీలకులు, కౌంటింగ్ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు ఉంటారని చెప్పారు. చిన్న నియోజకవర్గాల తొలి ఫలితాలు ఉదయం 10 గంటలకల్లా వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికల తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న సొమ్మును ఆధారాలు చూపితే, తిరిగి ఇచ్చేస్తారని తెలిపారు.

# కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండండి
### – అభ్యర్థులకు భట్టి విజ్ఞప్తి

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు : ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు కాంగ్రెస్ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ప్రజలు మార్పు కోసం తీసుకున్న నిర్ణయాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. ఎన్నికల్లో పాల్గొని కాంగ్రెస్ హస్తం గుర్తుపై భారీగా ఓట్లేసిన ప్రజలకు, అందుకు సహకరించిన మీడియాకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎల్బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అభిమానంతో ప్రజలు తమ పార్టీ పక్షాన నిలిచారని తెలిపారు. ఎన్నో సర్వే సంస్థలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ప్రకటించాయని గుర్తు చేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగపరుస్తున్నదని విమర్శించారు. అసైన్డ్ భూములను ధరణిలో తప్పుడుగా నమోదు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం వేరే వ్యక్తుల పేర్ల మీదకు మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వాపోయారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసిన పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని తెలిపారు. పనులు పూర్తి కాకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఒక ప్రభుత్వం నుంచి మరొక ప్రభుత్వం మారుతున్న క్రమంలో ఇష్టారాజ్యం వ్యవహరించకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ధర్మపురి, హుజూర్‌నగర్, మంచిర్యాల, ఇబ్రహీంపట్నం, తుంగతుర్తిలో ఇబ్బందులు నెలకొన్నాయని తెలిపారు. ప్రస్తుతం కోర్టుల్లో కేసులు కూడా ఇంకా నడుస్తున్నాయని వివరించారు. అందువల్ల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మధుయాష్కీ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌ను వీడుతున్నారని ఎద్దేవా చేశారు. అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. తమకు గెలుపుపై పక్కా సమాచారం అందిందన్నారు. ధరణిలో రాత్రికి రాత్రి భూముల పేర్లు మార్చుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు సబ్సిడీలు ఇవ్వకుండా రైతు బంధు డబ్బులు రూ. 5వేల కోట్లను దారి మళ్లించేందుకు కేసీఆర్ పావులు కదుపుతున్నట్టు విమర్శించారు. రాష్ట్రంలో జరిగిన అవినీతిపై కల్వకుంట్ల కుటుంబాన్ని వదిలిపెట్టేది లేదన్నారు.

# 3న ప్రజాసంక్షేమ ప్రభుత్వం

## నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ



**కంఠేశ్వర్- ప్రభాత సూర్యుడు :** డిసెంబర్ 3న ప్రజా సంక్షేమ ప్రభుత్వం ఏర్పడబోతోందని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అర్బన్ అభ్యర్థి షబ్బీర్ అలీ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమది సెక్యులర్ పార్టీ అని అన్నారు. దొర అరాచక, నియంత పాలనపై తెలంగాణ ప్రజలు విసుగు చెందారని, స్పష్టంగా ప్రజలు మార్పు కోరారని తెలిపారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన వారికి, సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కే ప్రజలు ఈసారి పట్టం కట్టబోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తుందని చెబుతున్నాయని, 25 సీట్ల కంటే ఎక్కువ బీఆర్ఎస్‌కు రావని తెలిపారు. ఇదే విషయాన్ని జాతీయ కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి కూడా చెప్పారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ మూడో స్థానంలో ఉందన్నారు. దీపం ఆరిపోయే ముందు వెలిగినట్టు ఎగ్జిట్ పోల్స్ ఫేక్ అని కేటీఆర్ అంటున్నారని, కేసీఆర్ నిన్న మీడియా ముందుకు రాకుండా ఓటమిని అంగీకరించారని చెప్పారు. నిజామాబాద్ అర్బన్‌లో కమిషన్ల ఎమ్మెల్యేపై కాంగ్రెస్‌కు కనీవినీ ఎరుగని రీతిలో మెజారిటీ వస్తుందన్నారు. భారీ మెజార్టీతో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని తెలిపారు. తనపై మతం రంగు రుద్ది ప్రజలను రెచ్చగొట్టి రాజకీయం చేద్దామనుకున్నారని, కానీ నిజామాబాద్ ప్రజలు కులమతాలకు అతీతంగా మనస్ఫూర్తిగా తనను ఆదరించారని తెలిపారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భారీగా తగ్గిన ఓటింగ్

## గెలుపుపై ఎవరి ధీమా వారిదే..



**వరంగల్- ప్రభాత సూర్యుడు**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత ఎన్నికల కంటే పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. దాంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. పోలింగ్ సరళిపై పార్టీ శ్రేణులతో అభ్యర్థులు కసరత్తు చేశారు. గెలుపుపై ఎవరికి వారు దీమా వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ఆదేశాలతో 10 శాతం పోలింగ్‌ను అదనంగా పెంచేందుకు తగిన చర్యలు తీసుకున్నామని అధికారులు చెప్పినా, ఇందులో ఘోరంగా విఫలమయ్యారు. గత ఎన్నికల కంటే 'పశ్చిమ'లో 2.62 శాతం పోలింగ్ తగ్గడం గమనార్హం. వరంగల్ తూర్పులో గణనీయంగా 6.71 శాతం, పరకాలలో 4.9, వర్ధన్నపేటలో 3.69, మహబూబాబాద్‌లో 2.72 శాతం పోలింగ్ తగ్గింది.

**అత్యధికంగా నర్సంపేటలో అత్యల్పం వరంగల్ పశ్చిమలో..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక పోలింగ్ నర్సంపేట నియోజకవర్గంలో 87.87 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 56.59 శాతం నమోదైంది. 2018 ఎన్నికల్లో నర్సంపేటలో అత్యధికంగా 90.05 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి 2.18 శాతం తగ్గింది. డోర్నకల్‌లో గతంలో 88.96 శాతం పోలింగ్ జరగ్గా, ఈసారి 87.73 శాతం నమోదై 1.23 శాతం తగ్గింది. పాలకుర్తిలో గత ఎన్నికల్లో 89.01 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈ ఎన్నికల్లో 86.68 శాతం నమోదైంది. 2.33 పోలింగ్ తగ్గడం చర్చకు దారితీసింది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 2018 ఎన్నికలతో పోలిస్తే 6.71 శాతం పోలింగ్ తగ్గడం చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో 73.45 శాతం నమోదు కాగా, ఈ ఎన్నికల్లో కేవలం 66.74 శాతం మాత్రమే నమోదైంది. కాగా, ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. పలువురు అభ్యర్థులు సామాజిక మాధ్యమాల్లో ఓటర్లకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్ఠానానిదే నిర్ణయం

## టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**



ముఖ్యమంత్రి పదవికి ఎవ రిని ఎంపిక చేయాలనే విషయాన్ని పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో గెలిచే 80కిపైగా ఎమ్మెల్యేల అభిప్రాయం అనంతరం పార్టీ సెలక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తమ ఎగ్జిట్ పోల్స్‌ను 'ఇండియా టుడే' శుక్ర వారం సాయంత్రం వెలువరించింది. ఆ కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ఏమైనా సందేశం ఇస్తారా? అని ప్రశ్నించగా.. కేసీఆర్‌కు తాను సందేశం ఇవ్వాల్సిన అవసరం లేదని, ప్రజలు ఇప్పటికే సందేశం ఇచ్చారని, మీ ఎక్స్‌పైరీ డేట్ ముగిసిందని స్పష్టం చేశారని, కేసీఆర్ ఇక ఫామ్‌హౌసకు, కేటీఆర్ అమెరికాకు వెళ్లిపోతారని వ్యాఖ్యానించారు. సరిగ్గా వచ్చే ఏడాది డిసెంబరులో కేటీఆర్ ఇంటర్వ్యూ కోసం ప్రయత్నిస్తే.. ఆయన ఎక్కడ ఉంటారో మీరే తెలుసుకుంటారని వ్యాఖ్యానించారు. త్వరలో తెలంగాణలో ప్రజల ప్రభుత్వం కొలువుదీరుతుందని ప్రకటించారు. "ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు రానున్నాయనే సంకేతాలతో మూడు రోజులుగా ప్రగతి భవన్‌ను ఖాళీ చేయడానికి వీలుగా సామాన్లు తరలిస్తున్నారు. ఈనెల 4న జరిగే మంత్రివర్గ సమావేశంలో రాజీనామాలపై కేసీఆర్ నిర్ణయం తీసుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ 80కిపైగా స్థానాల్లో విజయం సాధిస్తుంది. గెలిచిన ఎమ్మెల్యేలు సీఎం ఎంపికపై నిర్ణయం తీసుకుంటారు. సీఎం పదవికి కాంగ్రెసలో ఉన్న ప్రతి సహచరుడు అర్హుడే" అని స్పష్టం చేశారు. ఒకవేళ తాను ముఖ్యమంత్రి అయినా.. ఆ తర్వాత కూడా ప్రగతి భవన్‌కు వెళ్లబోనని, ఇక్కడే ఈ ఇంట్లోనే ఉంటానని వ్యాఖ్యానించారు. అధికారం కోసం తాను ఏ రోజూ అర్రులు చాచలేదని, చాలా పార్టీలు ఆఫర్లు ఇచ్చినా తిరస్కరించానని తెలిపారు. జడ్పీటీసీగా, శాసన మండలి సభ్యుడిగా స్వతంత్రంగానే గెలిచానని, అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజ్‌గిరి నుంచి విజయం సాధించానని గుర్తు చేశారు. ఇక మీకు, కేటీఆర్‌కు మధ్య పోటీపై అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. "నాకు, కేటీఆర్‌కు పోలిక లేదు. కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా. నేను మెరిట్ (ప్రతిభావంతుల) కోటా. పోటీ అంటూ ఉంటే కే సీఆర్‌కు, నాకు మధ్యే! కేటీఆర్‌కు గుర్తింపు సీఎం కుమారుడిగానే ఉంటుంది. నాకు ఎవరితోనైనా పోటీ ఉంటే అది కే సీఆర్, బండి సంజయ్ వంటి వారితోనే" అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా పోటీ జరిగిందని చెప్పారు. కాగా, సీఎం ఎవరనేది కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకుంటారని, తాను కాదని కాంగ్రెస్ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

**రేవంత్ ఇంటికి నేతల క్యూ**

శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా విజయం సాధిస్తుందని సర్వేలన్నీ ఘోషిస్తున్నాయి. తెలంగాణలో ఆ పార్టీ అధికారంలోకి వచ్చేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డికే రానున్న ప్రభుత్వంలో కీలక పదవి దక్కుతుందనే ప్రచారమూ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే, పలువురు పార్టీ నేతలు రేవంత్‌ను కలవడానికి ఆయన ఇంటికి క్యూ కడుతున్నారు. శు క్రవారం రేవంత్ రెడ్డిని మాజీ ఎంపీ, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ అభ్యర్థి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి, కూకట్‌పల్లి అభ్యర్థి బండి రమేశ్, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మహేషకుమార్‌గౌడ్, మల్లు రవి, వికారాబాద్ అభ్యర్థి గడ్డం ప్రసాద్, ఆలేరు అభ్యర్థి బీర్ల ఐలయ్య తదితరులు కలుసుకున్నారు.

**రేవంత్ సీఎం అవుతారు**

డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆ పార్టీ మాజీ ఎంపీ మల్లు రవి అన్నారు. 70-80 సీట్లలో విజయం సాధించనున్నామని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలంతా రేవంత్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. భట్టి విక్రమార్క కూడా పాదయాత్ర చేశారని, ఆయనకు కూడా అవకాశాలు ఉన్నాయని, కానీ, సీఎం అయ్యే అవకాశాలు రేవంత్‌కే అధికంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తానని ప్రకటించారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, కష్టపడ్డ వారే సీఎం అవుతారని, ఎవరు కష్టపడ్డారో అందరికీ తెలుసని మల్‌రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో తాను కూడా ఉంటానని, రంగారెడ్డి జిల్లాలో తనకంటే సీనియర్ ఎవరు లేరని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 12కు 12 స్థానాల్లో కాంగ్రెస్ గెలవనుందని బీర్ల ఐలయ్య అన్నారు.

**ఓటమి భయంతో రైతుబంధు నిధుల మళ్లింపు**

ఓటమి భయంతో కేసీఆర్.. రైతుబంధు నిధులను మళ్లిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

కమీషన్‌ల కోసం రైతుబంధు నిధులను కాంట్రాక్టర్లకు ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న అసైన్డ్ భూములను ఇతరుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేసే చెల్లింపులపై విజిలెన్స్ నిఘా పెట్టాలని హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాసరాజ్‌తోపాటు ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం సీఈవో రాజీవ్‌కుమార్‌కు శనివారం వినతి పత్రాలు సమర్పిస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు**

చాంద్రాయణగుట్ట, చార్మినార్, బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును నిలిపేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆయా స్థానాల్లో మజ్లిస్ రిగ్గింగ్‌కు పాల్పడటంతో పాటు బోగస్ ఓట్లు వేయించిందని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి.నిరంజన్ ఆరోపించారు. ఆ మూడు నియోజకవర్గాల పార్టీ అభ్యర్థులు బోయ నరేశ్, మహ్మద్ ముజీబుల్లా షరీఫ్, పులిపాటి రాజేశ్‌తో కలిసి నిరంజన్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఎంఐఎం నేతల అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలపై రిటర్నింగ్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించి రీపోలింగ్‌కు ఆదేశాలు జారీ చేయాలని.. అప్పటివరకు ఓట్ల లెక్కింపును నిలిపేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వినతిపత్రాన్ని పంపినట్టు తెలిపారు.


## వ్యాపారవేత్తలను ఇబ్బంది పెట్టినట్టు నిరూపిస్తే..

# రాజకీయాల నుంచి తప్పుకుంటా

## నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం

**నకిరేకల్ - ప్రభాత సూర్యుడు**

తాను ఎమ్మెల్యేగా (2014) ఉన్న కాలంలో ఏ వ్యాపార వేత్తనైనా ఇబ్బంది పెట్టినట్టు నిరూపిస్తే.. రాజకీయాల నుంచి తప్పుకుంటానని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని పన్నాల గూడెం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులను కూడా ప్రశాంతంగా ఓటు వేయనీయలేదని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి తన నోటికొచ్చిన విధంగా మాట్లాడారన్నారు. ఎవరైనా ఎన్నికల్లో తాను చేసిన అభివృద్ధి, పార్టీ మేనిఫెస్టోను వివరించుకుంటూ ప్రచారం నిర్వహిస్తారని, కానీ బీఆర్ఎస్ అభ్యర్థి తనను తిట్టడమే ఎజెండాగా పెట్టుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో గంజాయి సృష్టించింది.. బీఆర్ఎస్ అభ్యర్థి కుటుంబమేనని తెలిపారు. బొందల గడ్డను ధ్వంసం చేసిన చరిత్ర అతనిదేనని విమర్శించారు. సత్యానికి, అసత్యానికి అరాచకానికి, సహనానికి మధ్య జరిగిన ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలపాటు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నమస్కారాలు తెలియ జేశారు. నియోజకవర్గంలో బలమైన శక్తిగా కాంగ్రెస్ పార్టీ ఎదిగేలా ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని తెలిపారు. మీకోసం, ప్రజల కోసం ఒక పనిమనిషి లాగా పని చేస్తానన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 సీట్లు గెలవబోతున్నామని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. ఈ నెల 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్టు చెప్పారు. రానున్న ఐదేండ్లలో నకరేకల్ నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి చేసుకుందామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పూజర్ల శంభయ్య, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, నకిరేకల్ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్ రావు, చిట్యాల మున్సిపాలిటీ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకట్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి నకిరేకంటి ఏసు పాదం, నాయకులు యాస కరుణాకర్ రెడ్డి, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# ఎందుకు ఆగమైతుండ్రు.. మల్లా మనమే వస్తాం : కేసీఆర్

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

తెలంగాణ వ్యాప్తంగా నిన్న(నవంబర్ 30)న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడికానున్నాయి. అయితే ఎన్నికలు ముగిసిన వెంటనే వచ్చిన ఎగ్జిట్ పోల్ ఫలితాలు బీఆర్ఎస్ నేతలను ఆందోళనకు గురిచేశాయి. ఈ క్రమంలో శు క్రవారం ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పలువురు అభ్యర్థులు, సీనియర్ నేతలు భేటీ అయ్యారు. ఎగ్జిట్‌పోల్ ఫలితాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. ఈ క్రమంలో నేతలకు కేసీఆర్ ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. వచ్చేది మన ప్రభుత్వమే అని అభయమిచ్చారు. "ఎందుకు ఆగమాగం, పరేషాన్ అయితుండ్రు... మల్లా మనమే ఈ రాష్ట్రానికి సుపరిపాలన అందించబోతున్నాం. రెండు రోజులు నిమ్మలంగా ఉండండి. 3న అందరం కలిసి సంబరాలు చేసుకుందాం" అంటూ ప్రగతిభవన్‌లో కలిసిన పార్టీ నేతలతో కేసీఆర్ గెలుపు ధీమాను వ్యక్తంచేశారు.



## సంపాదకీయం

# దిగొస్తున్న రష్యా

20 మాసాలు నిండిన ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఇప్పట్లో అంతమయ్యే సూచనలు కనిపించడం లేదు. ఆధునిక ప్రపంచ నిత్య జీవనంలో అదీ ఒక భాగమైపోయింది. ఈ యుద్ధ వార్తలను ప్రజలిప్పుడు పట్టించుకోడం లేదు. ఈ స్తబ్ధ తను కొంచెం ఛేదిస్తూ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తాము శాంతి చర్చలకు వ్యతిరేకం కాదని, ఉక్రెయినే సహకరించడం లేదని అన్నారు. జి 20 పరోక్ష సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇంతకు ముందు ఢిల్లీలో జరిగిన జి20 అధిపతుల ప్రత్యక్ష సమావేశానికి పుతిన్ హాజరు కాలేదు. చర్చలకు తాను వ్యతిరేకిని కాదని ఆయన చెప్పుకొన్న సమయంలోనే రష్యా, ఉక్రెయిన్ రెండూ పరస్పర దాడులను ముమ్మరం చేసినట్టు వార్తలు వచ్చాయి. డజనుకి పైగా యుద్ధ డ్రోన్లను, ఒక క్షిపణిని రష్యా తమపై ప్రయోగించిందని, వాటిని కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళ అధికార్లు తెలియజేశారు. ఉక్రెయిన్‌లోని విద్యుత్ కేంద్రాలపై గురి పెట్టి రష్యా దాడులు పెంచిందని చెబుతున్నారు. ఉక్రెయిన్ కూడా అమెరికా, యూరపు నుంచి తనకు అందుతున్న సాయంతో రష్యాపై తీవ్రంగానే పోరాడుతున్నది. 2022 ఫిబ్రవరిలో మొదలైన రష్యా దాడుల వల్ల ఉక్రెయిన్‌లో ఇంత వరకు 10 వేల మంది మరణించారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఈ గణాంకాల సేకరణ ఇంకా జరుగుతున్నదని వాస్తవంలో ఈ సంఖ్య ఎక్కువగానే వుండవచ్చునని సమితి తెలియజేసింది. మృతుల్లో సగం మంది గత మూడు మాసాలలోనే యుద్ధానికి బలి అయిపోయారని సమితి వెల్లడించింది. మృతుల్లో బాలల సంఖ్య కూడా అపరిమితంగానే వుంది. యుద్ధం మొదలైన తర్వాత గత ఏడాది చలికాలంలో ఉక్రెయిన్ పౌరులు విపరీతంగా కష్టాలు ఎదుర్కొన్నారు. రష్యా దాడుల వల్ల 60 లక్షల మంది ఉక్రెయిన్ పౌరులు నిర్వాసితులై యూరపు దేశాలకు తరలిపోయారని తెలుస్తున్నది. పుతిన్ చెప్పినట్టు నిజంగానే రష్యా చర్చలను కోరుకొంటూ వుంటే అవి ఎందుకు జరగడం లేదు, ఎవరి మధ్య చర్చలు జరిగితే ఈ యుద్ధానికి తెరపడుతుంది అనేవి కీలకమైన ప్రశ్నలు. యుద్ధాన్ని విరమిస్తే ఎవరి షరతుల మీద జరగాలి అనేది ముఖ్యమైన అంశం. ఇంత కాలం ఎంతో ఖర్చు పెట్టి, అమెరికా ఆంక్షలకు గురవుతూ సాగిస్తున్న యుద్ధాన్ని తాను వీగిపోయే షరతుపై విరమించడానికి రష్యా బొత్తిగా సిద్ధపడదు.అలాగే ఉక్రెయిన్ చేతులెత్తేసి తన మానాన తాను బతకడానికి నిర్ణయించుకొంటే అందుకు అమెరికా గాని, యూరపు దేశాలు గాని సమ్మతించవు, అనుమతించవు. ఉక్రెయిన్ లోని డోనెస్క్, ఖేర్సన్, లుహాన్స్, మైకోలాయువ్, జపోరిజ్యా, ఓబ్లాస్ట్ అనే ప్రాంతాలను రష్యా ఆక్రమించుకొని వున్నది. క్రిమియా 2014లోనే రష్యాలో భాగమైపోయింది. ఈ భూభాగాలన్నింటినీ తిరిగి సాధించుకోవాలని ఉక్రెయిన్ కోరుకోడంలో తప్పేమీ లేదు. అయితే రష్యా అందుకు అంగీకరిస్తుందా? పుతిన్‌ను అధికారం నుంచి తప్పించి యుద్ధానికి ముగింపు చెప్పే సామర్థ్యం అమెరికాకు కలుగుతుందా? ఇది అంత సులభంగా తోచడం లేదు. మరి యుద్ధానికి ముగింపు ఎలా, ఎప్పుడు? ఐక్యరాజ్యసమితి అనే ఉత్సవ విగ్రహం వైఫల్యం పదే పదే రుజువు అవుతూనే వుంది. ఇది యుద్ధాల కాలం కాదు అని ప్రధాని మోడీ చేసిన ఉద్బోధ గాలిలో కలిసిపోయింది. దానిని చెవిన పెట్టేవారెవరూ లేరు. గాజాపై దాడులలో స్వల్ప విరామం సాధించిన పద్ధతిలోనే ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రంలో కూడా ఆట విడుపు ఒప్పందాన్ని కుదర్చగలిగే శక్తియుక్తులు ఎవరికీ లేవు. రెండు వైపులా అలసిపోయి ఇక చాలిద్దాం అనుకొనే పరిస్థితిని ఊహించలేము. ఉక్రెయిన్‌కు అదే పనిగా విరాళాలు, సైనిక సాయం అమెరికా, యూరపు దేశాల నుంచి లభిస్తున్నది. జర్మనీ 1.3 బిలియన్ యూరో (1.4 బిలియన్ డాలర్లు) ల సైనిక సాయాన్ని ఉక్రెయిన్‌కు ప్రకటించింది. రష్యాతో ఉక్రెయిన్ చేస్తున్న సాహసోపేతమైన, ఖరీదైన పోరాటాన్ని ఆరాధనా పూర్వకంగా సమర్థిస్తున్నాం, దాని పట్ల సంఘీభావాన్ని ప్రకటిస్తున్నామని జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ చేసిన ప్రకటన ఈ యుద్ధం ఇప్పట్లో చివరికి చేరే అవకాశాలు లేవనే అభిప్రాయాన్ని మరింత దృఢ పరుస్తున్నది. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైకెల్ ఉక్రెయిన్ రాజధానిని ఇటీవలే సందర్శించారు. ఉక్రెయిన్‌లో రష్యా మద్దతు గల అధ్యక్షుణ్ణి తొలగించిన ఘట్టానికి పదేళ్ళు నిండిన సందర్భంగా దానికి సంఘీభావంగా యూరపు దేశాల ప్రతినిధులు కీవ్‌ను సందర్శిస్తున్నారు. కాబట్టి ఇది కేవలం రష్యా ఉక్రెయిన్ల మధ్య యుద్ధం ఎంత మాత్రం కాదు. రష్యాకు, అమెరికా, దాని మిత్ర పక్షాలకు సాగుతున్న ప్రాబల్య సంఘర్షణ ఇది. ఇదిలా కొనసాగినంత కాలం మానవాళికి మంచి జరగదు. చైనా చొరవతో, అమెరికా మద్దతుతో చర్చలకు అవకాశాలు ఎప్పటికైనా అంకురిస్తాయేమో వేచిచూడాలి.

# పురాణాలతో భవిష్యత్తు సంక్షోభం

### ఎస్వీకే వెబినార్‌లో ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



రామాయణం, మహాభారతం, పురాణాలతో విద్యార్థుల భవిష్యత్తు సంక్షోభంగా మారుతుందని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి హరగోపాల్ అన్నారు. గత చరిత్ర గొప్పతనాన్ని చెప్పాల్సిందేననీ, అయితే దానివల్ల సమాజానికి, ప్రజలకు భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి స్పష్టత ఉండాలని చెప్పారు. అప్పుడే మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. 'చరిత్ర పాఠ్యపుస్తకాల్లో పురాణాలా?'అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్వీకే) ఆధ్వర్యంలో శు క్రవారం వెబినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చరిత్రను రాసిన వాళ్లంతా మార్క్సిస్టులు కాబట్టి పాఠ్యాంశాలను మారుస్తున్నామని బీజేపీ నాయకులు చెప్తున్నారని వివరించారు. అయితే మార్క్సిస్టులు రాసినా, ఇతరులు రాసినా ఆ చరిత్ర వాస్తవమా? కాదా?, దానికి చారిత్రక ఆధారాలున్నాయా? లేదా?అనేది గమనించాలని సూచించారు. అంతే తప్ప వారు రాశారు కాబట్టి ఆ చరిత్ర స్థానంలో పురాణాలను విద్యార్థులకు అందించడం సమంజసం కాదన్నారు. భారతదేశానికి సంబంధించి మధ్యయుగాలనాటి చరిత్రను వదిలేసి రామాయణం, మహాభారతం, పురాణాల గురించి చరిత్ర పాఠ్యపుస్తకాల ద్వారా అందిస్తే విద్యార్థులకు స్పష్టమైన అవగాహన లోపిస్తుందని వివరించారు. అయితే వాటిలో ఉండే వాస్తవికత, కాల్పనికత గురించి చెప్పాల్సిన అవసరముందన్నారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఖగోళ విజ్ఞానం, చంద్రునిపై ప్రయోగాలు విజయవంతమవుతున్న ఈ ఆధునికయుగంలో విశ్వాసాలకు సంబంధించిన చరిత్రను విద్యార్థులకు అందిస్తే నూతన సమాజం ఎలా ఏర్పడుతుందని ప్రశ్నించారు. అంబేద్కర్ కలలుగన్న కులరహిత సమాజం కావాలని చెప్పారు. ఉపాధ్యాయులపై ఉన్న నమ్మకంతో రామాయణం, మహాభారతం, పురాణాలే చరిత్రగా చదివితే ఓ తరం జ్ఞానాన్ని కోల్పోతుందని, భవిష్యత్తు సంక్షోభంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ కాలంలో ఉండే అనేక రకాల అవతారాలు ఇప్పుడెందుకు రావడం లేదన్న ప్రశ్న విద్యార్థులకు వస్తుందన్నారు. ఇంకోవైపు సమాజంలో ఉండే సవాళు ,, సమస్యలు, హింస, ఆధిపత్యం, అసమానతల వంటి వాటికి కారణమెవరన్న ఆలోచనలు వస్తాయని చెప్పారు. మతం విశ్వాసాల ఆధారంగా గతంలోకి వెళ్తుందన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తును సైన్స్ నిర్మాణం చేస్తుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం, సమాజం పురోగతి ఉండేలా పాఠ్యాంశాలను అందించాల్సిన అవసరముందని అన్నారు. చరిత్ర మార్పుపై ఎన్‌సీఈఆర్టీ అవలంభిస్తున్న వైఖరిపై విస్తృతంగా చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# బీజేపీ ఆశలు...గల్లంతేనా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయి. ఇప్పుడు అందరి చూపు ఫలితాలపైనే ఉంది. ఎవరు గెలుస్తారు? ఎవరు ఓడిపోతారు? అధికారం చేజిక్కుంచుకునేదెవరు? అనే అంశాలపైనే రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ రిలీజ్ కాగా, వాటి ఫలితాలన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నాయి. ముఖ్యమంత్రి హ్యాట్రిక్ కొడతారా? లేక ప్రజలు గద్దె దింపుతారా? అనే సందేహాలకు ఆదివారం సమాధానం దొరకనుంది. పదేండ్ల పాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్ వైపే ఎగ్జిట్ పోల్స్ ఉండటంతో ఆ పార్టీ నేతలంతా ఫుల్ జోష్‌లో ఉన్నారు. అయితే బీజేపీ విషయానికి వస్తే మాత్రం సీన్ రివర్స్ అయింది. ఆ పార్టీ అంచనాలన్నీ తలకిందులయ్యాయిఈ అసెంబ్లీ ఎన్నికలను బీజేపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దక్షిణాదికి గేట్ వేగా కమలం పార్టీ తెలంగాణను ఎంచుకుంది. అయితే ఇప్పటికే సౌత్ స్టేట్స్‌లో అధికారంలో ఉన్న కర్ణాటకను చేజార్చుకుంది. ఇక ఆ పార్టీ ఆశలు పెట్టుకున్న ఏకైక ఆప్షన్ తెలంగాణను సైతం వదులుకోక తప్పడంలేదని ఎగ్జిట్‌పోల్స్ స్పష్టం చేస్తున్నాయి. అధికారంలోకి వస్తామని, బీసీనే ముఖ్యమంత్రి అవుతారని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలలు కన్నారు. కానీ ఈ ఎగ్జిట్ పోల్స్‌తో వారిప్పుడు నిరాశకు లోనయ్యాయి. పలు సంస్థలు ఇచ్చిన ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీకి 10 సీట్లు దాటలేదు. గరిష్టంగా 10 సీట్లుగా పేర్కొన్నాయి. ఎగ్జిట్ పోల్స్ అన్నీ షాక్ ఇచ్చేలా ఉండటంతో ఆ పార్టీ నేతలంతా సందిగ్ధంలో పడ్డారు. పలువురు ఏమీ పాలుపోని పరిస్థితిలో ఉన్నారు.ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీకి వచ్చిన స్థానాలపై ఆ పార్టీ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఎగ్జిట్ పోల్స్‌ను పలువురు బీజేపీ నేతలు కొట్టిపారేశారు. అవేమీ ఫైనల్ కాదని అంటున్నారు. ఇక మరికొందరు నేతలు మాత్రం గతంతో పోల్చుకుంటే బీజేపీ స్థితి మెరుగైందని, ఓటుబ్యాంకు పెరిగిందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ స్థానానికే పరిమితమైన కాషాయ పార్టీ, రెండు బైపోల్స్‌లో నెగ్గి మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలు అయ్యారు. ఈ ఎన్నికల్లో 3వ స్థానం నుంచి మరిన్ని సీట్లు అదనంగా రాబోతున్నాయని చెబుతున్నారు. అంతేకాకుండా అసలు ఏమాత్రం ఉనికిలేని స్థానాల్లో బీజేపీకి ఓటు బ్యాంకు పెరుగుతుందని అంటున్నారు. గత ఎన్నికలకు, ఈ ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉండబోతోందని భావిస్తున్నారు.ఇదిలా ఉండగా ఇటీవల పలువురు బీజేపీ నేతలు సీట్లు ఎన్ని వచ్చినా అధికారం మాత్రమే తమ పార్టీదేనని బాహటంగానే చెప్పారు. బీజేపీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ గతంలో హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా తెలంగాణలో హంగ్ వస్తుందని, అధికారం బీజేపీయే చేపడుతుందని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కాగా ఇటీవల నిజామాబాద్ ఎంపీ, కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అర్వింద్ సైతం బీజేపీకి ఎన్ని సీట్లు వచ్చినా అధికారం కాషాయ పార్టీదేనని మీడియా ముఖంగానే చెప్పారు. వారు చేసిన కామెంట్స్ వెనుకున్న మర్మమేంటనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే ఉంది. ఈనెల 3వ తేదీ రిజల్ట్స్ తర్వాతే దీనికి సమాధానం దొరకనుంది.

# గులాబీ హ్యాట్రిక్ సాధ్యమేనా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఓటర్లు తమ నిర్ణయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేస్తున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరాం ఎన్నికలు ముగిశాయి. తెలంగాణ ఎన్నికలు జరుగుతున్నాయి. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఫలితాలే వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. తెలంగాణలో ఓటింగ్ ముగిసిన తర్వాత సాయంత్రంలోగా వెలువడే ఎగ్జిట్ పోల్ అంచనాలపైనే అందరి దృష్టి ఉంటుందిఅధికార భారత రాష్ట్ర సమితిని గద్దె దించేందుకు విపక్ష కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్ అయితే బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అన్నట్లుగా ప్రచారం నిర్వహించింది. ఇక చివరకు ప్రచారంలో బీజేపీ కూడా జోరు పెంచింది. వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా, రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ గట్టిపోటీనిస్తోంది. మరోవైపు రాష్ట్రంలో తన ఉనికిని చాటుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రచారం ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలోని అవినీతిని లక్ష్యంగా చేసుకుంది. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఇక బీజేపీ 'డబుల్ ఇంజన్ ప్రభుత్వం' పేరుతో ప్రచారం చేసింది. కుటుంబ రాజకీయాలతో గులాబీ పార్టీపై ఎదురు దాడి చేసింది.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రచార సమయంలో అనేక సమావేశాలలో ప్రసంగించారు, భారీ అభిమానుల మధ్య సోమవారం హైదరాబాద్‌లో రోడ్‌షో నిర్వహించడంతోపాటు, కేసీఆర్ 96 ఎన్నికల సభలు నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా సహా పలువురు కేంద్రమంత్రులతోపాటు కాంగ్రెస్ నేతలు మల్లిక్‌ర్జున ఖర్గే, రాహుల్ గాంధీ తమ తమ పార్టీ అభ్యర్థుల కోసం ఓట్ల కోసం ప్రచారం చేశారు.తెలంగాణలో త్రిముఖ పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీలు కొన్ని మిత్రపక్షాలను కూడా చేర్చుకున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 119 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను నిలబెట్టింది. సీట్ల పంపకాల ఒప్పందం ప్రకారం బీజేపీ 111, జనసేన 8 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ తన మిత్రపక్షమైన సీపీఎంకు ఒక సీటు ఇచ్చింది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం హైదరాబాద్‌లోని తొమ్మిది సెగ్మెంట్లలో అభ్యర్థులను నిలబెట్టింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హోరీహోరీ పోరు జరిగింది. త్రిముఖ పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ క్రమంలో ఓటరు నాడి మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ చిక్కలేదు.

BHARAT RASHTRA SAMITHI
భారత రాష్ట్ర సమితి

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215